సాక్షి
తూర్పుగోదావరి
శుక్రవారం | 10 | మార్చి | 2023



స్నానాబజానా

వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అన్నవరం గోశాలలోని గోవులకు గురువారం నుంచి షవర్ బాత్ ప్రారంభించారు.

8లో




చోరీ కేసును ఛేదించిన పోలీసులు

భారీ చోరీ కేసును రంగంపేట పోలీసులు ఛేదించారు. 52 గ్రాముల బంగారం, 10 తులాల వెండి, రూ.2.40 లక్షల నగదు రికవరీ చేశారు.

8లో

డెల్టాలకు 7,350 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 7,350 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,170, మధ్య డెల్టాకు 1,410, పశ్చిమ డెల్టాకు 3,770 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 6.35 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని రెండు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు ఈ నెల 13న జరిగే ఎన్నికలకు కొవ్వూరు డివిజన్‌లో ఏర్పాట్లు పూర్తి చేశామని జరిగిందని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎంకే మీనా వెలగపూడి నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, కొవ్వూరు డివిజన్ పరిధిలో 242 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని అన్నారు. వీరిలో 107 మంది పురుషులు, 135 మంది మహిళలు ఉన్నారన్నారు. కొవ్వూరు మున్సిపాలిటీలో 23 మంది, నిడదవోలులో 28 మంది, జెడ్పీటీసీ సభ్యులు తొమ్మిది మంది, ఎంపీటీసీ సభ్యులు 179 మంది, ముగ్గురు ఎమ్మెల్యేలు ఓటు వేయనున్నారని వివరించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించామని తెలిపారు. 13వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ కొవ్వూరు ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో పోలింగ్ జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. సమావేశంలో డీఆర్ఓ జి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మండలంలో మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేయాలి



డీఆర్‌డీఏ పీడీ సుభాషిణిని సత్కరిస్తున్న ఏపీఎం తదితరులు

తాళ్లపూడి: స్వయం సహాయక గ్రూపుల్లోని మహిళల భాగస్వామ్యంతో ప్రతి మండలంలోనూ మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేయాలని డీఆర్‌డీఏ పీడీ ఎస్.సుభాషిణి అన్నారు. చేయూత పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మండలానికి మంజూరు చేసిన ప్రాజెక్టులను ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డ్వాక్రా సభ్యులు నిత్యావసర సరకులను ఈ మార్ట్‌లలో కొనుగోలు చేయడం ద్వారా రూ.కోటి వరకూ టర్నోవర్ చేయవచ్చని, కమీషన్‌గా ఇచ్చే 2 శాతం కూడా ఆ సంఘాలకే ఇస్తామని తెలిపారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత కోసం బయోమెట్రిక్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలోని 2.38 లక్షల మందికి పింఛన్లుగా రూ.64.56 కోట్లు అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఎం రోజ్ మాణిక్యం ఆధ్వర్యాన పీడీ సుభాషిణిని ఘనంగా సత్కరించారు. సమావేశంలో డీపీఎం ఎం.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

డీవార్మింగ్ డేపై అవగాహన కల్పించాలి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నులి పురుగుల నివారణ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారులు, సిబ్బందికి కలెక్టర్ కె.మాధవీలత సూచించారు. ఈ నెల 14, 18 తేదీల్లో నిర్వహించే నులి పురుగుల నివారణ (డీవార్మింగ్ డే) కార్యక్రమం పోస్టర్లను గురువారం ఆమె ఆవిష్కరించారు.

ప్రశాంతంగా పది ప్రీ ఫైనల్



వెంటూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రీ ఫైనల్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

రాయవరం: పదవ తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు గురువారం జిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 3 నుంచి పది పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో నిర్వహిస్తున్న ప్రీ ఫైనల్ పరీక్షలు విద్యార్థుల సామర్థ్యాన్ని మదింపు చేస్తాయి. మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు ఫస్ట్ లాంగ్వేజ్ తెలుగు పరీక్ష నిర్వహించారు. ప్రింటెడ్ ప్రశ్న పత్రాలను పరీక్షా సమయానికి గంట ముందుగా కేంద్రాలకు చేరుకునేలా అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం సెకండ్ లాంగ్వేజ్ హిందీ పేపరును నిర్వహిస్తారు. కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఉన్న 374 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 19,084 మంది రెగ్యులర్ విద్యార్థులు ప్రీ ఫైనల్ పరీక్షలు రాశారు. పబ్లిక్ పరీక్షల మాదిరిగానే ప్రీ ఫైనల్ పరీక్షలను నిర్వహించారు. డీఈవో ఎం.కమలకుమారి ఆధ్వర్యంలో డీవైఈవో, ఎంఈవోలు వారి పరిధిలో జరుగుతున్న పరీక్షలను పర్యవేక్షణ చేశారు.

మైనర్ ఇరిగేషన్‌కు మహర్దశ

- రూ.38.29 కోట్లతో 53 పనులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- చెరువులు, స్లూయిజ్‌లు, చెక్ డ్యామ్‌ల ఆధునీకరణకు రంగం సిద్ధం
- రాజానగరం నియోజకవర్గ ప్రజలకు మేలు
- వరదలు, ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం



శ్రీరంగపట్నం దుఃఖదాయిని: వర్షాకాలంలో గట్టు తెగేలా బురద కాలువ ఉధృతి (ఫైల్)

సాక్షి, రాజమహేంద్రవరం: మైనర్ ఇరిగేషన్‌కు మహర్దశ పట్టనుంది. రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లోని 53 మైనర్ ఇరిగేషన్ పనులకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా ఆమోదం తెలిపింది. రూ.38.29 కోట్ల వ్యయంతో పనుల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు. ఈ పనులు పూర్తయితే రాజానగరం నియోజకవర్గంలోని శివారు ప్రాంతాల సాగునీటి ఎద్దడి శాశ్వతంగా పరిష్కారమవుతుంది. ప్రధానంగా కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామం నాలుగు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న బురద కాలువ ముంపు బెడదకు ముకుతాడు పడుతుంది. దీంతో పాటు అధ్వానంగా ఉన్న మైనర్ ఇరిగేషన్ చెరువుల స్లూయిజ్‌లు, చెక్ డ్యామ్‌లు, సర్‌ప్లస్ వియర్ల పునర్నిర్మాణం, ఆధునీకరణ వంటి పనులు జరగనున్నాయి. వీటిల్లో లీకేజీలను అరికట్టి, నీటి నిల్వ సామర్థ్యం పెంచడం ద్వారా ఆయకట్టులోని ప్రతి ఎకరాకూ నీరు అందనుంది.

శ్రీరంగపట్నంపై ఫోకస్

అల్లూరి సీతారామరాజు జిల్లా గంగవరం మండలం నుంచి వచ్చే బురద కాలువ గోకవరం, శ్రీరంగపట్నం, మునగాల గ్రామాల మీదుగా ప్రవహించి సీతానగరం మండలం కూనవరం వద్ద గోదావరిలో కలుస్తుంది. సూరంపాలెం ప్రాజెక్టు నుంచి మిగులు జలాలను దిగువకు వదిలేసే క్రమంలో బురద కాలువ ద్వారా భారీగా నీరు వచ్చి పడి, శ్రీరంగపట్నం ముంపునకు గురవుతోంది. దీంతో ఈ సమస్య పరిష్కారంపై దృష్టి కేంద్రీకరించారు. ఇందులో భాగంగా శ్రీరంగపట్నంలో రాజు సప్లయ్ చానల్‌ను రూ.883.40 లక్షలతో పటిష్టపరచనున్నారు. కోరుకొండ గ్రామం వద్ద బురద కాలువ కుడి గట్టును 21.270 కిలోమీటరు నుంచి 21.370 కిలోమీటరు వరకూ రూ.80.33 లక్షలతో పటిష్టపరచనున్నారు. ఈ పనులు పూర్తయితే శ్రీరంగపట్నం, మునగాల, బూరుగుపూడి, కోటి, గుమ్ములూరు, బుచ్చెంపేట గ్రామాల్లోని 5 వేల ఎకరాల పంట భూములకు ముంపు సమస్య తప్పనుంది.

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో..

ముంపు సమస్యను పరిష్కరించాలని గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయా ప్రాంతాల రైతులు ప్రస్తుత రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు మొర పెట్టుకున్నారు. మూడేళ్ల క్రితం ఇచ్చిన హామీని ఆయన మరచిపోలేదు. క్షేత్రస్థాయి పరిస్థితులను, సాంకేతిక అంశాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. సీఎంను కలిసిన ప్రతిసారీ ఈ సమస్యను ప్రస్తావించేవారు. తరచూ సంబంధిత అధికారులకు గుర్తు చేస్తూ వచ్చారు. రాజా సుదీర్ఘ కృషి ఫలితంగా బొబ్బిల్లంక లిఫ్ట్ నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే రూ.91.10 కోట్లు విడుదల చేసింది. ఈ పనులు పురోగతిలో ఉన్నాయి. శ్రీరంగపట్నం ముంపు సమస్య, స్లూయిజ్‌లు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి మరో రూ.38.29 కోట్లు విడుదల చేసింది. త్వరలోనే టెండర్లు ఆహ్వానించి ఈ పనులను పట్టాలపైకి ఎక్కించనున్నారు.

హామీ నిలబెట్టుకోగలిగాం



ముంపు సమస్య పరిష్కార హామీ నిలబెట్టుకోగలుగుతామా అనే భయం కలిగింది. వేల ఎకరాల్లో పంట ముంపునకు గురవుతోందని చెప్పిన వెంటనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించారు. నిధులు మంజూరు చేశారు. చాలా ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రికి నియోజకవర్గ రైతులు రుణపడి ఉంటారు.

– జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే, రాజానగరం

15 రోజుల్లో టెండర్లు



మైనర్ ఇరిగేషన్ పనులకు ప్రభుత్వం విడుదల చేసిన నిధులను ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేస్తాం. పనులు త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. 15 రోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తాం. రైతులకు అవసరమైన చోట చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తాం.

– అడబాల శివప్రసాద్, ఏఈ, జలవనరుల శాఖ



అభివృద్ధికి నోచనున్న కొండకురుదు చెక్‌డ్యాం



రూపు మారనున్న రంగసాయి స్లూయిజ్

ఇవీ ప్రధాన పనులు

- శ్రీరంగపట్నం గ్రామం వద్ద బురద కాలువపై 22వ కిలోమీటరు వద్ద రూ.197.80 లక్షలతో చెక్ డ్యామ్‌ను పునర్నిర్మించనున్నారు. దీనివల్ల 2 వేల ఎకరాలకు పుష్కలంగా సాగు నీరు లభిస్తుంది.
- శ్రీరంగపట్నం వద్ద కోటి బోదెపై రూ.52.10 లక్షలతో ఎస్ఎల్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ఇది పూర్తయితే వ్యవసాయ ఉత్పత్తులు ఇళ్లకు చేరవేసేందుకు, యంత్రాల రవాణాకు మార్గం సుగమం కానుంది.
- కోరుకొండ – శ్రీరంగపట్నం మధ్య రూ.133.27 లక్షలతో బురద కాలువను 20వ కిలోమీటరు నుంచి 23.655 కిలోమీటరు వరకూ ఆధునీకరించనున్నారు.
- సీతానగరం మండలం రామచంద్రపురం వద్ద చెరకు ఆవ డ్రెయిన్‌కు చేపట్టనున్న ఆధునీకరణ పనుల కారణంగా 800 ఎకరాల సాగు భూములకు ముంపు బెడద తొలగనుంది.
- సీతానగరం మండలం రఘుదేవపురం వద్ద స్పెషల్ ఎండీ చానల్‌ను రూ.110.21 లక్షలతో పటిష్టపరచనున్నారు.
- పురుషోత్తపట్నం నుంచి కొండేపూడి వరకూ చెరుకూరు ఆవ చానల్‌ను రూ.140.22 లక్షలతో ఆధునీకరించనున్నారు. దీంతో ఆయకట్టుకు ముంపు బెడద తప్పుతుంది.
- కోరుకొండ మండలం కణుపూరు పరిధిలోని ముంద్రువారి చెరువుకు అత్యవసర మరమ్మతులతో పాటు సర్‌ప్లస్ చానల్‌పై రూ.199.49 లక్షలతో బ్రిడ్జి నిర్మిస్తారు. దీని వలన రెండో పంటకు సాగు నీరు అందడంతో పాటు, రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు రవాణా సౌకర్యం కలుగుతుంది.
- కోరుకొండ మండలం బుచ్చెంపేట – శ్రీరంగపట్నం పరిధిలో తోట కాలువను 0 కిలోమీటరు నుంచి 4.870 కిలోమీటరు వరకూ రూ.164.80 లక్షలతో బాగు చేయనున్నారు. ఫలితంగా ముంపు నివారణ జరిగి, నీటి పారుదల సౌకర్యం మెరుగుపడనుంది.
- కోరుకొండ మండలం రాఘవాపురం వద్ద నారాయకన్న సర్‌ప్లస్ చానల్‌పై 5 చెక్ డ్యామ్‌లకు రూ.111.70 లక్షలతో అత్యవసర మరమ్మతులు చేపట్టనున్నారు.
- కోరుకొండ మండలం బొల్లెద్దులపాలెం పరిధిలోని వినుకొండ కాలువపై చెక్ డ్యామ్‌కు రూ.40.58 లక్షలతో అత్యవసర మరమ్మతులు చేపట్టనున్నారు. ఫలితంగా గరగలంపాలెం పరిధిలోని వెయ్యి ఎకరాలకు సాగునీటి సమస్య తీరనుంది.
- రాజానగరం మండలం జి.యర్రంపాలెం తిమ్మరాజు (పెద్ద) చెరువుకు రూ.68.40 లక్షలతో అత్యవసర మరమ్మతులు చేపట్టనున్నారు.
- సీతానగరం మండలం కూనవరం డ్రెయిన్‌ను రూ.387.82 లక్షలతో ఆధునీకరిస్తారు.
- తొర్రిగడ్డ డ్రెయిన్‌పై జగన్నాథపురం, గుమ్ములూరు పరిసరాల్లో చెక్ డ్యామ్‌లు, తోట కాలువ ఆధునీకరణ, గట్ల పటిష్టత ద్వారా సుమారు 10 వేల ఎకరాలకు ముంపు బెడద తొలగనుంది.

డ్వాక్రాకు టోకరా



ఏలేశ్వరం యూనియన్ బ్యాంక్ వద్ద ధర్నా చేస్తున్న డ్వాక్రా మహిళలు

- ఏలేశ్వరంలో 'తమ్ముళ్ల' దందా
- టీడీపీ హయాంలో ఘరానా మోసం
- డ్వాక్రా సంఘాల పేరుతో రూ.కోటి వరకూ లూటీ
- మూడేళ్ల తరువాత మహిళలకు బ్యాంకు నుంచి నోటీసులు
- రుణాలు తిరిగి చెల్లించామంటున్న బాధితులు
- న్యాయం చేయాలని ఆందోళన

సాక్షి ప్రతినిధి, కాకినాడ: నాటి చంద్రబాబు ప్రభుత్వ హయాంలో.. అన్యాయంగా డబ్బులు లూటీ చేసేందుకు తెలుగు తమ్ముళ్లు బరితెగించారు.. అప్పటి అధికారులతో కుమ్మక్కయ్యారు.. రికార్డులు తారుమారు చేసేశారు.. డ్వాక్రా సంఘాల సభ్యులను మోసం చేసి.. రుణాల పేరుతో బ్యాంకు నుంచి సొమ్ములు డ్రా చేసి గుటకాయ స్వాహా చేశారు.. ఆ మహిళలను నిండా ముంచేశారు.. మూడేళ్ల క్రితం.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఏలేశ్వరం కేంద్రంగా గుట్టు చప్పుడు కాకుండా ఈ స్వాహా పర్వాన్ని సాగించారు. తీసుకున్న రుణాలు చెల్లించాలంటూ బ్యాంకు నుంచి ఇప్పుడు నోటీసులు రావడంతో అమాయక మహిళలు లబోదిబోమంటున్నారు.. దీంతో ఈ అక్రమ బాగోతం వెలుగులోకి వచ్చింది.

ఏం జరిగిందంటే..

ఏలేశ్వరం నగర పంచాయతీలో 2019 మే 5న అప్పటి మెప్మా సిబ్బంది, యానిమేటర్లు, బ్యాంకు అధికారులు కుమ్మక్కై రూ.కోటి మేర అక్రమాలకు తెర తీశారు. క్రాంతికిరణ్, జయదుర్గ, బాలాత్రిపురసుందరి, మహాత్మా, శృతి చైతన్య, మేరీమాత, శరణ్య, జగదంబ, కాజాబాబా, సాయి, వైశాలి, గ్రేసి, కృప తదితర 14 డ్వాక్రా గ్రూపుల పేరిట యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏలేశ్వరం బ్రాంచి నుంచి రుణాలు తీసుకున్నట్టు మెప్మా రికార్డుల్లో ఉంది. వీటి ప్రకారం 10 గ్రూపులు రూ.10 లక్షలు, 4 గ్రూపులు రూ.5 లక్షల చొప్పున రుణాలు తీసుకున్నాయి. వాస్తవానికి ఆయా సంఘాల సభ్యులకు అంత మొత్తం చేరలేదు. ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఇచ్చినట్టు రికార్డులు సృష్టించారు. తీరా వారికి ఇచ్చింది మాత్రం అందులో 10 శాతానికి మించి లేదు. 10 సంఘాల్లోని సభ్యులకు రూ.10 వేల చొప్పున, నాలుగు సంఘాల్లోని సభ్యులకు రూ.5 వేల చొప్పున మాత్రమే ఇచ్చారు. కానీ, ఎక్కువ మొత్తం ఇచ్చినట్టుగా ఆయా సంఘాల సభ్యుల నుంచి సంతకాలు తీసుకున్నారు. రుణాలు జమ చేయాలని యానిమేటర్లు చెప్పడంతో ఆయా సంఘాల సభ్యులు రుణ వాయిదా సొమ్మును వారి చేతిలోనే (సాధారణంగా సంఘాల సభ్యుల ఆర్థిక లావాదేవీలు ఇరుపక్షాల నమ్మకంపై జరుగుతూంటాయి) పెట్టారు. ఆ సొమ్మును బ్యాంకుకు జమ చేశారని డ్వాక్రా సభ్యులు అనుకున్నారు.

రుణాల పేరుతో మోసం



రుణాల పేరుతో మోసపోయాం. ఈ రుణాలతో మాకు ఎటువంటి సంబంధమూ లేదు. యానిమేటర్లు, మెప్మా ఉద్యోగి, మమ్మల్ని అప్పుల పాలు చేశారు. సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి.

– కాపారపు శాంతకుమారి, ప్రెసిడెంట్, క్రాంతికిరణ్ గ్రూపు

ప్రభుత్వం ఆదుకోవాలి



రుణాల కుంభకోణంలో మోసపోయిన మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి. కూలీ పని చేసుకుని జీవిస్తున్నాం. లక్షలాది రూపాయలు కట్టాలంటే మాకు దారి లేదు. ప్రభుత్వం విచారణ జరిపి దోషులను శిక్షించాలి.

– ఎం.హారిక, సభ్యురాలు, గ్రేసి గ్రూపు

నోటీసులు రావడంతో..

2019లో తీసుకున్న రుణాలకు సంబంధించి ఒక్కో డ్వాక్రా సంఘం రూ.7 లక్షల చొప్పున బకాయి ఉన్నట్టు బ్యాంకు నుంచి తాజాగా నోటీసులు వచ్చాయి. దీంతో డ్వాక్రా మహిళలు అవాక్కయ్యారు. తాము మోసపోయామని ఆలస్యంగా గుర్తించారు. తీసుకున్న రుణం తిరిగి చెల్లించేసినా ఇప్పుడు నోటీసులు రావడమేమిటని బాధిత మహిళలు నిలదీస్తూంటే.. నాడు రుణాల మంజూరప్పుడు క్రియాశీలకంగా ఉన్న టీడీపీ నాయకులు కిమ్మనడం లేదు. ఈ నేపథ్యంలో బాధిత మహిళలు ఇటీవల కాకినాడ కలెక్టరేట్‌కు వచ్చి జరిగిన మోసాన్ని కలెక్టర్ కృతికా శుక్లాకు, డీఆర్‌డీఏ పీడీకి, ఇతర అధికారులకు వివరించారు. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు డ్వాక్రా మహిళలకు పసుపు – కుంకుమ పేరుతో మంజూరైన రూ.10 వేలు కూడా రుణ బకాయిలకు జమ చేసుకున్నారని వారు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ కాకినాడ కలెక్టరేట్ వద్ద, ఏలేశ్వరంలోని యూనియన్ బ్యాంకు బ్రాంచి వద్ద ఇటీవల ధర్నాలు చేశారు. ముగ్గురు యానిమేటర్లు, ఇద్దరు మెప్మా టౌన్ మిషన్ కో ఆర్డినేటర్లు (టీఎంసీ), ఏలేశ్వరం నగర పంచాయతీ ఉద్యోగి, బ్యాంక్ బ్రాంచిలో అప్పట్లో పని చేసిన ఇద్దరు అధికారులు, పట్టణానికి చెందిన నలుగురు టీడీపీ నాయకులతో కుమ్మక్కై ఈ అవినీతి బాగోతానికి పాల్పడ్డారని ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో మొత్తం రూ.కోటి వరకూ పక్కదారి పట్టినట్టు అంచనా వేస్తున్నారు. ఈ 14 సంఘాలతో పాటు మరికొన్ని సంఘాల సభ్యులను కూడా ఇలానే నమ్మించి, నట్టేట ముంచేశారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పరీక్షలు సమీపిస్తున్నా సిలబస్ పూర్తి చేయరా?

- డీఈఓ అబ్రహం ఆగ్రహం
- దూబచర్ల హైస్కూలులో ముగ్గురు టీచర్లకు షోకాజ్ నోటీసులు

నల్లజర్ల: 'పరీక్షలు దగ్గర పడుతున్నా సిలబస్ పూర్తి చేయరా? కేవలం విద్యార్థులకు పాఠాలు బోధిస్తే సరిపోదు, దాంతో పాటు నోట్స్ కూడా రాయించాలి. ఇలా అయితే పిల్లలు ఏం చదువుతారు? పరీక్షల్లో ఏం రాస్తారు?' అంటూ ఉపాధ్యాయులపై జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ఎస్.అబ్రహం మండిపడ్డారు. ఈ మేరకు దూబచర్ల జెడ్పీ హైస్కూలులోని గణితం, ఇంగ్లిషు, ఫిజిక్స్ ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మండలంలోని ఆరు పాఠశాలలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దూబచర్ల జెడ్పీ హైస్కూలులో 8వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. వివిధ అంశాలను పరిశీలించారు. అనంతరం అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు వెళ్లారు. తరువాత డైట్ కళాశాలలో నాడు – నేడు పనుల పురోగతిని సమీక్షించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతపల్లి, తూర్పు చోడవరం, తెలికిచెర్ల జెడ్పీ హైస్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకం అమలు, నాడు – నేడు పనులను పరిశీలించారు. తూర్పు చోడవరం ప్రాథమిక పాఠశాలను డీఈఓ సందర్శించారు.

వివిధ కోర్సులలో ఉచిత శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ ఐటీఐ సంయుక్త ఆధ్వర్యాన పీఎంకేవీవై 4.0 పథకం ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతకు వివిధ కోర్సులలో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జీవీ రమణరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆర్ అండ్ ఏసీ మెకానిక్, ఎలక్ట్రీషియన్, డొమెస్టిక్ సొల్యూషన్, స్యూయింగ్ మెషీన్ ఆపరేటర్ (స్త్రీలకు), స్మార్ట్ ఫోన్ అసెంబ్లింగ్ టెక్నీషియన్, ఫిట్టర్ మెకానికల్ అసెంబ్లింగ్ కోర్సులలో ధవళేశ్వరం ప్రభుత్వ ఐటీఐలో శిక్షణ ఇస్తామని వివరించారు. ఈ కోర్సులలో చేరడానికి 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి, పదో తరగతి నుంచి డిగ్రీ లేదా పీజీ చదివిన వారు అర్హులన్నారు. శుక్రవారం నుంచి ప్రభుత్వ ఐటీఐలో ఉచితంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేస్తారని తెలిపారు. అభ్యర్థులు ఆధార్ కార్డ్ జిరాక్స్, ఫోన్ నంబర్, ఈ-మెయిల్ ఐడీతో ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలన్నారు. వివరాలకు 90636 48365, 96038 59666 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రీసర్వే పనులు వేగవంతం చేయాలి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జగనన్న భూ రక్ష – భూహక్కు పథకం సర్వే ప్రక్రియను రెవెన్యూ, సర్వే శాఖలు సమన్వయంతో వేగవంతం చేయాలని కలెక్టర్ కె.మాధవీలత ఆదేశించారు. ఈ అంశంపై సీసీఎల్ఏ కమిషనర్ సిద్ధార్థ జైన్ అమరావతి నుంచి గురువారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భూ సమగ్ర సర్వేలో భాగంగా జిల్లాలోని 269 రెవెన్యూ గ్రామ పంచాయతీల పరిధిలోని 248 గ్రామాల్లో చెక్ మార్కింగ్ పాయింట్ ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. మిగిలిన 121 గ్రామాల్లో పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఇప్పటి వరకూ 292 గ్రామాల్లో డ్రోన్ సర్వే చేస్తూండగా.. మరో 77 గ్రామాల్లో పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. గ్రౌండ్ ట్రూతింగ్‌కి సంబంధించి రెండో దశలో 16 గ్రామాలకు గానూ 15 గ్రామాల్లో ఇప్పటికే పనులు పూర్తయ్యాయని చెప్పారు. 44 గ్రామాలకు 72,485 సర్వే రాళ్లు సరఫరా చేయాల్సి ఉండగా, 33,946 అందాయన్నారు. వీటిలో 26,273 సర్వే రాళ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. 272 గ్రామ పంచాయతీలకు గాను 208 చోట్ల భూ రికార్డుల ప్రక్షాళన చేపట్టి, 92 గ్రామాల్లో పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. జూన్ నాటికి పనులు పూర్తి చేసేలా దిశా నిర్దేశం చేశామని చెప్పారు.

క్లుప్తంగా

పంచారామ క్షేత్ర హుండీల ద్వారా రూ.13.56 లక్షలు



సామర్లకోట పంచారామ క్షేత్రం హుండీలను లెక్కిస్తున్న భక్తులు

సామర్లకోట: స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామ భీమేశ్వరస్వామి ఆలయ హుండీల ద్వారా రూ.13,56,770 ఆదాయం వచ్చినట్లు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. గురువారం ఆలయ హుండీలను లెక్కించారు. మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఈ ఆదాయం వచ్చిందన్నారు. గత ఏడాది మహాశివరాత్రికి రూ.11,01,919 ఆదాయం వచ్చిందన్నారు. మహాశివరాత్రి పూజలు, అన్నదాన విరాళాలు, టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.9,63,055 రాగా గత ఏడాది 2,21,441 వచ్చినట్టు చెప్పారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, నాతిపాముల సూరిబాబు, చల్లా కుమారి, కర్రి వెంకటలక్ష్మి, నేతల వెంకటలక్ష్మి, భక్త సంఘం సభ్యులు బిక్కిన సాయి, బీవీ రమణ, సత్తిబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు మరింత నాణ్యతగా జరగడానికి డ్వామా అధికారులకు శిక్షణ ఇస్తున్నట్లు విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ తెలిపారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణను ఆయన గురువారం ప్రారంభించారు. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో పనిచేస్తున్న డ్వామా ఏపీడీ, ఏపీఓ, ఏసీ, టెక్నికల్ అసిస్టెంట్లకు ఇక్కడ శిక్షణ ఇస్తారు. వేణుగోపాల్ మాట్లాడుతూ మార్చి 18 వరకు వివిధ బ్యాచ్‌లకు శిక్షణ నిర్వహిస్తామని తెలిపారు. ప్రతీ బ్యాచ్‌కు మూడు రోజుల శిక్షణ ఉంటుందన్నారు. మొబైల్ యాప్‌పై ప్రతీ ఒక్కరికి అవగాహన పెరిగే విధంగా శిక్షణ ఉంటుందన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే పనుల గుర్తింపు, అంచనాల తయారు, మొక్కలు నాటడం, పుస్తకాల నిర్వహణ, మేట్ల పనితీరు, ఉపాధి హామీలో ఇప్పటి వరకు జరిగిన పనిలో లోపాలను గుర్తించి వాటిని సవరణ చేయడం, సామాజిక తనిఖీ వంటి అంశాలపై శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణ కోఆర్డినేటర్ బండారు శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్ ఆధ్వర్యంలో రీసోర్సు పర్సన్లు ఎం.సత్యనారాయణ, ఎస్. నరేష్‌బాబు, ఎస్.శ్యామల, వి.సురేష్‌కుమార్, జి.రాజేష్, నరేష్, కేవీవీ సత్యనారాయణ, జీటీఎస్ సాగర్ మొదటి రోజు శిక్షణ నిర్వహించారు.

స్నానాబజానా

- సత్యదేవుని సన్నిధిలో చక్కగా గోపాలన
- జల్లు స్నానం... వేణుగానం
- కొండ దిగువన గోశాలలో ఆరు షవర్ల ఏర్పాటు



గోవులకు వేణుగానం వినిపించేందుకు ఏర్పాటు చేసిన ఆడియో సిస్టం



గోవులకు జల్లు స్నానం చేయిస్తున్న దృశ్యం

అన్నవరం: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్నవరం గోశాలలో గల గోవులకు గురువారం నుంచి షవర్ బాత్ చేయిస్తున్నట్లు దేవస్థానం ఎలక్ట్రికల్ డీఈ టి.సూర్యనారాయణ తెలిపారు. గోశాలలో సుమారు 300 గోవులున్నాయి. వాటికి షవర్ బాత్ చేయించేందుకు మూడేసి చొప్పున ఆరు షవర్లు ఏర్పాటు చేశారు. గోవు ముఖం పక్కన, వీపు మీద, తోకకు ముందు భాగంలో నీరు పడేలా ఈ షవర్లు ఏర్పాటు చేశారు. ఏక కాలంలో రెండు గోవులకు మూడు నిమిషాలలో ఇద్దరు సేవకులు పూర్తిగా షవర్ బాత్ చేయించేలా ఏర్పాటు చేశారు. రోజుకు కనీసం 150 గోవులకు ఈ షవర్‌బాత్ చేయించేందుకు ఏర్పాటు చేశామని, ఒకో రోజు 300 గోవులకు కూడా షవర్ బాత్ చేయిస్తారని డీఈ సూర్యనారాయణ వివరించారు.

గోవులకు వేణుగానం

దేవస్థానం గోశాలలోని షెడ్లలో గోవులకు వేణుగానం వినపించేందుకు ఏర్పాట్లు చేసినట్లు డీఈ తెలిపారు. ఇందుకోసం ఆడియో ప్లేయర్, గోవుల షెడ్లలో సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేశామని వివరించారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం ఈ వేణుగానం వినిపిస్తున్నట్లు తెలిపారు. దీనివలన గోవులకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని, స్ట్రెస్ కూడా తగ్గుతుందని తెలిపారు. ద్వారకాతిరుమల దేవస్థానంలోని గోశాలలో ఎప్పటి నుంచో గోవులకు జల్లు స్నానం, వేణుగానం ఏర్పాటు చేశారని చెప్పారు. అదే స్ఫూర్తి తో ఇక్కడ కూడా ఏర్పాటు చేయాలని ఇన్‌చార్జి ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశించారని ఆయన వివరించారు.

అంగుళం భూమినీ వృథాగా వదిలేయవద్దు

తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, రిటైర్డ్ పీసీసీఎఫ్ శోభ



రాజానగరం: అటవీ విస్తీర్ణం పెరగాలంటే అందుబాటులో ఉన్న అంగుళం భూమిని కూడా వృథాగా వదిలేయకూడదని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, రిటైర్డ్ అటవీ ప్రధాన దళపతి (పీసీసీఎఫ్) ఆర్.శోభ అన్నారు. దివాన్‌చెరువు అటవీ పరిశోధన కేంద్రంలోని ఏపీ స్టేట్ ఫారెస్ట్ అకాడమీని గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అడవులను పెంచడం కోసం కొత్త భూములు కేటాయించే పరిస్థితి ఎక్కడా ఉండదన్నారు. గ్రామాల నుంచి పట్టణాలు, రహదార్ల వరకు ప్రతిచోటా అవకాశం మేరకు గ్రీన్ కవర్ ఏర్పాటు ద్వారా పచ్చదనాన్ని పెంచడమే హరిత హారం కార్యక్రమ ముఖ్యోద్దేశమని పేర్కొన్నారు. చీభారతదేశంలో 21.34 శాతం మేరకు అటవీ ప్రాంతం కాగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అది 24 శాతంగా ఉందన్నారు. దీనిలో దట్టమైన అడవులు ఉన్న ప్రాంతం 25 శాతం లోపేనని తెలిపారు. హరితహారంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో 109 చోట్ల అర్బన్ పార్క్స్ ఏర్పాటు చేశారన్నారు. అడవులను పెంచడం అనేది యాంత్రికంగా జరిగేది కాదని, ఐదేళ్ల పాటు అంకితభావంతో ఫారెస్టు సిబ్బంది పని చేస్తే ఒక నర్సరీ ఫారెస్టుగా రూపాంతరం చెందుతుందని శోభ పేర్కొన్నారు. అకాడమీ డైరెక్టర్ పీఏవీ ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ హరితహారం ప్రాజెక్టును విజయవంతం చేయడానికి రిటైర్డ్ పీసీసీఎఫ్ శోభ చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమంటూ ప్రశంసించారు. రాజమహేంద్రవరం సర్కిల్ సీసీఎఫ్ శ్రీశరవణన్, అకాడమీ ఏసీఎఫ్‌లు డాక్టర్ ఎస్.వి.శివరామ ప్రసాద్, వి.శ్రీహరిగోపాల్, బీవీ రమణమూర్తి, టి.శ్రీనివాసరావు, రేంజ్ అధికారి అనూష పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

- రాజవొమ్మంగి వాసిగా గుర్తింపు



కొవ్వూరు శ్రీనివాస స్నానఘట్టంలో పడి ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కొవ్వూరు: పట్టణ శివారున శ్రీనివాస స్నానఘట్టం సమీపంలో రావణబ్రహ్మ విగ్రహం వద్ద ఈ నెల 7వ తేదీన గుర్తించిన మృతదేహం అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా రాజవొమ్మంగి గ్రామం కమ్మరి పేటకు చెందిన కలింకోట గంగాసాగర్ (26)దిగా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 2వ తేదీన రాత్రి రాజవొమ్మంగిలో బయల్దేరి సుబాబుల్ చెట్లు నరకడానికి 18 మంది జట్టు కార్మికులు 3వ తేదీకి గుంటూరు వెళ్లారు. పని నచ్చకపోవడంతో గంగాప్రసాద్‌తో పాటు జర్తా వీర వెంకట సత్యనారాయణ, భూముల ప్రసాద్, మిరియాల సతీష్ నాలుగో తేదీన తిరుగు పయనం అయ్యారు. బస్సు చార్జీలు చాలకపోవడంతో దేవరపల్లి మండలం గౌరీపట్నం వద్ద దిగిపోయారు. అక్కడి నుంచి మిగిలిన ముగ్గురు వేర్వేరు మార్గాల్లో స్వగ్రామానికి బయల్దేరారు. గంగాసాగర్ ఆరో తేదీకి కొవ్వూరులో శ్రీనివాసస్నాన ఘట్టం వద్దకు చేరుకున్నాడు. ఆ రాత్రి అక్కడే ఉండి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. గుంటూరు నుంచి తిరుగు ప్రయాణంలో విజయవాడ బస్టాండ్‌లో ఒకసారి, మార్గమధ్యలో మరోసారి గంగాసాగర్‌కు మూర్ఛ వ్యాధి వచ్చినట్లు సహచరులు చెబుతున్నారని పోలీసులు తెలిపారు. ఆహారం సరిగా లేకపోవడం, నడచి అలసిపోవడం, మూర్ఛ వ్యాధి కారణంగానే గంగాసాగర్ మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు, కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. వీఆర్వో లూథ్ పాల్ ఫిర్యాదు మేరకు ఏఎస్సై జీజీ ప్రకాష్ గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు 7వ తేదీన పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు చేశారు. మిగిలిన ముగ్గురు సహచరులు ఇంటికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు ఆరా తీయగా ప్రతికల్లో ప్రచురితం అయిన ఫొటో ఆధారంగా గంగాసాగర్ మృతి చెందినట్లు గుర్తించారు. గురువారం రాత్రి కుటుంబ సభ్యులు, సన్నిహితులు కొవ్వూరు పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. మృతదేహం గంగాసాగర్‌దిగా గుర్తించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు. మృతుడికి తండ్రి, ముగ్గురు అక్కలు ఉన్నారని ఎస్సై తెలిపారు.

రత్నగిరికి లగ్గసిరి

అన్నవరం: వివాహాల సీజన్‌లో రత్నగిరి సత్యదేవుని సన్నిధికి విచ్చేసిన నవదంపతులను చూస్తే. తమ కోర్కెలు తీరాలని సత్యదేవుని దర్శించే నవదంపతులు ఎందరో. బుధవారం రాత్రి, గురువారం తెల్లవారు జామున జరిగిన సుమారు వంద వివాహాలతో ఒక్కటైన నవదంపతులు గురువారం సత్యదేవుని ఆలయంలో సందడి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల అదే ముహూర్తాలలో వివాహాలు చేసుకున్న వారు సత్యదేవుని ఆలయానికి బంధుమిత్రులతో తరలివచ్చి స్వామివారి వ్రతాలాచరించి దర్శనం చేసుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం, వ్రత మంటపాలు, విశ్రాంతి మంటపాలు అన్నీ నవదంపతులు, వారి బంధుమిత్రులతో నిండిపోయాయి. శుక్రవారం తెల్లవారుజామున ముహూర్తంలో రత్నగిరిపై 50కి పైగా వివాహాలు చేసుకునేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఉసురు తీసిన అతి వేగం

- రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి మృతి
- మోటార్ సైకిల్‌ను వేగంగా ఢీకొట్టిన కారు
- వివాహమైన ఏడాదికే విషాదం
- తల్లిదండ్రులు, భార్య కన్నీరు మున్నీరు



కిరణ్ మృతదేహం



కిరణ్ (ఫైల్)

పెరవలి: కారు డ్రైవర్ నిర్లక్ష్యం ఒక యువకుడిని బలి తీసుకుంది. జాతీయ రహదారిపై పెరవలి మండలం ఖండవల్లి వద్ద గురువారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో మోటార్ సైకిలిస్టు మృతి చెందాడు. పెరవలి ఎస్‌ఐ ఎం.సూర్య భగవాన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఖండవల్లి సచివాలయం–2లో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చిక్కాల కిరణ్ (29) గురువారం విధులకు హాజరై మధ్యాహ్నం భోజనానికి వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు వేగంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కిరణ్ మోటార్ సైకిల్‌పై ఖండవల్లి వస్తుండగా రావులపాలెం నుంచి తణుకు వైపు వేగంగా వస్తున్న కారు వెనుక ఢీకొట్టడంతో మోటార్ సైకిల్‌పై నుంచి ఎగిరి సుమారు 15 అడుగుల దూరంలో రోడ్డుపై పడటంతో కిరణ్ తలకు బలమైన గాయాలయ్యాయి. కారును వదలి డ్రైవర్ పరారయ్యాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఘొల్లుమన్న కుటుంబ సభ్యులు

కన్నకొడుకు కాని రాని లోకాలకు వెళ్లిపోయాడని తెలిసిన ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడు కిరణ్‌కు ఏడాది క్రితమే వివాహం అయ్యిందని, ఇతనికి మూడు నెలల బాబు ఉన్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య విమల బాలింతరాలు కావటంతో విషయం తెలిసి కన్నీరు మున్నీరుగా విలపించటంతో ఆమెను ఓదార్చేవారే కరువయ్యారు. పసిబిడ్డతో ఎలా బతికేదీ నేను.. ఏమిచెయ్యను అంటూ విలపిస్తుంటే చూపరులు సైతం కన్నీరు పెట్టుకున్నారు.

సహచర ఉద్యోగుల ఆవేదన

కిరణ్ మితభాషి అని, తనకు ఇచ్చిన పని చేయటమే తప్ప ఇంకో ధ్యాస ఉండదని, అటువంటి మంచి వ్యక్తికి ఇలా జరగటం దారుణమని సహచర ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్..

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- 52 గ్రాముల బంగారం, 10 తులాల వెండి, రూ.2.40 లక్షల నగదు రికవరీ
- వివరాలు వెల్లడించిన అనపర్తి సీఐ శ్రీనివాస్



చోరీ కేసు వివరాలను విలేకర్లకు తెలుపుతున్న అనపర్తి సీఐ శ్రీనివాస్



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి నగలు, నగదు

రంగంపేట: చోరీ కేసును రంగంపేట పోలీసులు ఛేదించారు. వివరాలను అనపర్తి సీఐ వి.శ్రీనివాస్ గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు తెలిపారు. మార్చి ఒకటో తేదీన రంగంపేట మండలం రామేశ్వరంపేట గ్రామానికి చెందిన కోన అప్పారావు ఉదయం ఇంటికి తాళం వేసి పొరుగూరు వెళ్లారు. సాయంత్రం వచ్చి చూడగా ఇంటి తాళాలు బద్దలు కొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని బంగారు, వెండి నగలతో పాటు నగదు చోరీకి గురైనట్లు గుర్తించి రంగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ చోరీకి పాల్పడిన మహబూబాబాద్‌కు చెందిన మహమ్మద్ రఫీని ఈనెల 8వ తేదీ మధ్యాహ్నం మధ్యవర్తుల సమక్షంలో అరెస్టు చేసి అతని వద్ద నుంచి 52 గ్రాముల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి వస్తువులు, రూ.2.40 లక్షల నగదును స్వాధీ నం చేసుకున్నట్లు వివరించారు. నిందితుడు మహమ్మద్‌రఫీని గురువారం పెద్దాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండు విధించినట్లు తెలిపారు. కేసును ఛేదించిన తనను, రంగంపేట ఎస్‌ఐ టి.రామకృష్ణ, సిబ్బందిని ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి అభినందించారని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

మోసం చేసిన వ్యక్తికి మూడేళ్ల జైలు

కాకినాడ లీగల్: నకిలీ పత్రాలు చూపి ఏసీ సబ్ కాంట్రాక్ట్ ఇప్పిస్తానని రూ.44 లక్షలు తీసుకొని మోసం చేసిన వ్యక్తికి మూడేళ్ల జైలు, రూ.10వేలు జరిమానా విధిస్తూ కాకినాడ రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రసన్న లక్ష్మి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కిర్లంపూడి గ్రామానికి చెందిన దాడి రాజగోపాలకృష్ణ కాకినాడ ఎస్ఆర్ఎంటీ మాల్(ఐనాక్స్)కు మేనేజర్‌గా పని చేస్తున్నానని కాకినాడకు చెందిన సయ్యద్ ఇలియాజ్(మున్నా)కు చెప్పాడు. ఐనాక్స్‌లో ఏసీ అమర్చడానికి సబ్ కాంట్రాక్ట్‌ను ఇప్పిస్తానని రూ.44 లక్షలు మున్నా వద్ద నుంచి 2016లో తీసుకున్నాడు. ఆ డాక్యుమెంట్ నకిలీ అని తేలడంతో టూ టౌన్ పోలీసులకు మున్నా ఫిర్యాదు చేశారు. కోర్టు విచారణలో రాజగోపాలకృష్ణపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు, రూ.10వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఏపీపీ గోశాల కమలాకుమారి ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

తల్లిని హత్య చేసిన కుమారుడికి జీవిత ఖైదు

ధవళేశ్వరం: తల్లి ఒంటిపై కిరోసిన్ పోసి నిప్పు పెట్టి హత్యకు పాల్పడిన కుమారుడికి జీవిత ఖైదు విధిస్తూ రాజమహేంద్రవరం ఎస్సీ,ఎస్టీ కోర్టు జడ్జి ఎం.నాగేశ్వరరావు గురువారం తీర్పు ఇచ్చారు. కేసుకు సంబంధించి ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధవళేశ్వరం ఇందిరాకాలనీకి చెందిన ముళ్ళగిరి బేబి సరోజినిపెద్ద కొడుకు ముళ్ళగిరి కిషోర్‌కల్యాణ్ 2020వ సంవత్సరం ఏప్రిల్ 26వ తేదిన వెనుక నుంచి ఆమెపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. దీంతో తీవ్ర గాయాలైన ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 2020వ సంవత్సరం జూలై 19న బేబి సరోజిని మృతి చెందింది. దీనిపై అప్పటి ఎస్సై టి గణేష్ కేసు నమోదు చేశారు. వాదనలు అనంతరం హత్యకు పాల్పడిన ముళ్ళగిరి కిషోర్‌కల్యాణ్‌కు జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటరత్నం వాదనలు వినిపించారు. ముద్దాయికి శిక్ష పడేలా కృషి చేసిన కోర్టు కానిస్టేబుల్స్ పి.రమేష్, జి. ప్రసాద్‌ను అధికారులు అభినందించారు.

అశ్లీల నృత్య ప్రదర్శన నిర్వాహకులపై కేసు

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం కొమానపల్లి గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన ముత్యాలమ్మ జాతరలో అశ్లీల నృత్య ప్రదర్శన నిర్వహించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.సురేష్‌బాబు తెలిపారు. జాతరలో అసభ్య నృత్యాలు ప్రదర్శిస్తున్నారని సమాచారం రావడంతో ఆకస్మికంగా దాడి చేశామన్నారు. ప్రదర్శన ఇస్తున్న వారంతా పరారవ్వగా ఆర్కెస్ట్రా యజమాని దూనబోయిన కిషోర్, నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టుతో సంఘ కార్యదర్శి ప్రకాష్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): జిల్లా ఫెన్సింగ్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10న కాకినాడ ద్రోణాచార్య అకాడమీలో జరగనున్న రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో పాల్గొనే జిల్లా జట్టు ఎంపికను గురువారం నిర్వహించారు. స్థానిక రామారావుపేటలోని మున్సిపల్ స్కూల్ ఆవరణలో రాత్రి నిర్వహించిన ఎంపికల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. వీరినుంచి 12 మంది బాలురు, 12 మంది బాలికలను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో జిల్లాకు మంచి పేరు తేవాలని సంఘ కార్యదర్శి పీఎస్‌వీఎస్ ప్రకాష్ కోరారు.

నూతన క్యాథ్ ల్యాబ్ ప్రారంభం



నూతన క్యాథ్‌ల్యాబ్ ప్రారంభిస్తున్న చైర్మన్ భాస్కరరావు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా తాము ముందుకెళ్తున్నట్లు కిమ్స్ హాస్పిటల్ చైర్మన్ బొల్లినేని భాస్కరరావు గురువారం తెలిపారు. బొల్లినేనిలో అత్యాధునిక రెండో క్యాథ్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ నూతనంగా తీసుకొచ్చిన క్యాథ్‌ల్యాబ్‌తో రోగితో పాటు డాక్టర్, సిబ్బందికి తక్కువ రేడియేషన్ ఉంటుందన్నారు. తదుపరి తరం ఇమేజ్ గైడెడ్ థెరపీ ప్లాట్‌ఫారమ్ అందుబాటులో ఉంటుందన్నారు. రోటాబ్లేషన్ (బోస్టన్)తో సంక్లిష్ట కరోనరీ వ్యాధులకు అధునాతన చికిత్స చేయవచ్చన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో మొట్టమొదటిసారిగా రెండు అధునాతన క్యాథ్‌ల్యాబ్‌లు కిమ్స్ హాస్పిటల్‌లో మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. కిమ్స్ బొల్లినేని ఈడీ స్వర్ణ రామ్మోహన్, చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రామరాజు, డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.

నూకాంబిక హుండీ ఆదాయం రూ.4.77 లక్షలు



ఆదాయం లెక్కిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది, భక్తులు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసియున్న నూకాంబికా అమ్మవారికి హుండీ ద్వారా రూ.4.77 లక్షల ఆదాయం లభించింది. అమ్మవారి ముఖ మంటపంలో రామచంద్రపురం దేవదాయశాఖ తనిఖీ ఇన్‌స్పెక్టర్ బాలాజీ రామ్‌ప్రసాద్ పర్యవేక్షణలో చైర్మన్ నూకపెయ్యి శ్రీనివాసు, ఈఓ ఉండవల్లి వీర్రాజు సమక్షంలో గురువారం అధికారులు, అనపర్తికి చెందిన శ్రీమాణిక్యాంబ భీమేశ్వర స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు ఆలయంలోని ఎనిమిది హుండీలను లెక్కించారు. 2022 మే 23 నుంచి 2023 మార్చి 8 వరకూ ఈ ఆదాయం లభించింది.